Eenadu   Dt 30/04/12



మెట్రోతో మరో దుబాయ్!

- ట్రాఫిక్ నివారణకు మార్వల్స్‌ను పెంచుతాం
- వేగవంతంగా ప్రత్యామ్నాయ రహదారుల పూర్తి
- నేటి నుంచి అమీర్‌పేట-కృష్ణానగర్ సర్వే
- ప్రాజెక్టుతో 50 వేల మందికి ఉపాధి
- రెండో దశలో మరింత విస్తరణ
- ట్రామ్‌వే కాదు... మెట్రో రైలే..

'ఈనాడు-మీతోడు'లో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ...వివరాలు 4లో

న్యూస్‌టుడే, హైదరాబాద్

ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెట్రో రైలుతో భాగ్య నగర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరడమే కాదు... భాగ్యనగరం మరో దుబాయ్‌ని తలపి స్తుంది...' అని మెట్రో రైలు ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో పనులు సంద ర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు ఇతరత్రాఇబ్బందులపై ఆదివారం 'ఈనాడు-మీతోడు' కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెట్రో పనులు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు కొంతమేర పెరిగిన మాట వాస్తవమేనన్నారు. అయితే ఓ భారీ ప్రాజెక్టు చేపడుతున్న దరిమిలా నగరవాసులు కాస్త సంయమనంతో సహకరించాల్సిందిగా కోరారు. రూ.40 కోట్లతో రహదారుల విస్తరణ చేపట్టడమంటే సామాన్య విషయం కాదని, దానిని ఆచరణలో చూపుతున్నామన్నా రు. ఇన్నాళ్లూ నిర్లక్ష్యానికి గురైన వరద నీటి కాల్వలను సైతం ఆధునికీకరించడంతో వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు అధ్య యనాలు కూడా చేపడుతున్నామని చెప్పిన ఎన్వీఎస్ రెడ్డి... స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థుల సహకారాన్ని కూడా స్వాగతిస్తున్నామన్నారు.

రెండో దశతో విస్తృతంగా...



నగరంలో 71.16 కిలోమీటర్ల మేర దేశంలోనే భారీ మెట్రోను చేపడుతున్నాం. ఒక్క కిలోమీటరుకు రూ.200 కోట్ల మేర ఖర్చవుతుంది. అందుకే జనసాంద్రత ఎక్కువగా ఉన్న కీలక ప్రాంతా ల్లోనే ప్రాజెక్టును డిజైన్ చేశాం. మొదటి దశను విజయవంతంగా పూర్తి చేసి ఫలితాలను చూపితే... రెండో దశకు అనుమతి ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. నాగోల్-ఎల్బీనగర్, ఎల్బీనగర్-వనస్థలిపు రం, మియాపూర్-ప టాన్‌చెరు, శిల్పారా మం-గచ్చిబౌలి ఎయిర్‌పోర్టు, ఫలక్ నుమా-ఎయిర్‌పో ర్టు, జూబ్లీ బస్టాండ్-అల్వాల్, మెట్టుగూడ-ఈసీఐఎల్... ఇలా ప్రధానంగా వినిపిస్తున్న డిమాండ్లపై అధ్యయనం చేస్తాం... అని ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు.

కోర్టు అనుమతితో సర్వే...

అమీర్‌పేట-కృష్ణానగర్ ప్రాంతంలో హైకోర్టు స్టేతో ఇప్పటివరకు పనులు నిలిచిపోయాయని, దీనిపై నెల రోజుల్లో ఓ స్పష్టత వస్తుందని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. సర్వే, భూసార పరీక్షలు నిర్వహించేందుకు కోర్టు అనుమతిచ్చిన దరిమిలా ఆ పనులను సోమవారం నుంచి మొదలుపెడతామన్నారు. సాధ్య మైనంత వరకు తక్కువ మేరలో ఆస్తులు, స్థలాల సేక రణకుగాను ఈ సర్వే చేపడుతు న్నామని అన్నారు. ఎక్కడా, మునుపెన్న డూలేని విధంగా యూఎల్‌సీ, ఇతర ప్రభుత్వ భూముల్లో ఉన్న వారికి సైతం ఆ ప్రాంతంలో గజానికి రూ.45వేల వరకు నష్టపరిహారం ఇవ్వడం విశేషమన్నారు. ఏపీ ట్రామ్‌వే చట్టం ప్రకారమే చేప డుతున్నా... ఇది ట్రామ్ రైలు కాదన్నారు. ఢిల్లీ, బెంగళూరు తరహాలోనే ఇక్కడ కూడా మెట్రో రైలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సికింద్రాబాద్, నాంపల్లి, బేగంపేట ప్రధాన రైల్వే స్టేషన్లతో పాటు ఆరు ఎంఎంటీఎస్ స్టేషన్లు, జేబీఎస్, ఎంజీబీఎస్ బస్‌స్టేషన్లతో నేరుగా మెట్రోను అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. 2014 డిసెంబరు నాటికి నాగోలు-మెట్టుగూడ వరకు 8 కిలోమీటర్ల మేర మెట్రోను అందుబాటులోకి తెస్తామన్నారు.

విశేష స్పందన...

మెట్రో రైలు ప్రాజెక్టుపై ఆదివారం ఉదయం 11.30 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించిన 'ఈనాడు-మీతోడు' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఏకంగా 38 మంది 40 ఫోన్‌కాల్స్ ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు మంచి సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజ కవర్గాల నుంచి ఎక్కువ మంది ట్రాఫిక్ ఇబ్బందులను ఎన్వీఎస్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో పాటు పలు ప్రత్యా మ్నాయ మార్గాలపై సలహాలు ఇచ్చారు. ఎన్వీఎస్ రెడ్డి ఇచ్చిన సమాధానాలు సంక్షిప్తంగా...

సమస్యలు స్వల్ప కాలమే... సహకరించండి!

ఫోన్ ఇన్ కార్యక్రమంలో మెట్రో ఎండీ

● **ప్రశ్న:** పోస్టర్లలో మెట్రో రైలు అని ముద్రించారు. ఇటీవల ట్రామ్‌వే రైలని చెబుతున్నారు. ఏది వాస్తవం?

– నిఖిల్‌సాయి, ఎల్బీనగర్, శ్రీధర్, నాంపల్లి

□ **ఎండీ:** ట్రామ్‌వే చట్టం కింద ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టాప్‌క్లాస్ రైలును, ఢిల్లీ, బెంగళూరు కంటే ఉత్త మమైన రైలును ప్రవేశపెడతాం. ట్రామ్‌వే చట్టం కింద పనులు చేపడుతున్నప్పటికీ ఇది మెట్రో రైలే! ఒక్కో బోగీకి రూ.9-10 కోట్లు ఖర్చవుతుంది. నగరంలో 30 సర్వీసుల ద్వారా గంటకు 60 వేల మంది ప్రయాణిస్తారు. రైలు వేగం గంటకు 80 కిలోమీటర్లు. అయితే ప్రతి కిలోమీటరుకు ఒక స్టేషన్ ఉండటం, ఒక్కో చోట 30 సెకన్లు ఆగడం వల్ల గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు.

● **ప్రశ్న:** జేసీబీతో తవ్వడం వల్ల సుమిత్రానగర్ వద్ద మంచినీటి పైపులైను పగిలింది. 15 రోజుల నుంచి నీటి సరఫరా రావడం లేదు

– ఎంఏ ఖదీర్, హైదర్‌నగర్, వ్యాపారి

□ **ఎండీ:** దీనిపై జలమండలి అధికారులు అంచనాలు రూపొందించారు. వెంటనే పనులు ప్రారంభమవుతాయి.

● **ప్రశ్న:** బ్యారికేడ్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కూకట్‌పల్లి ప్రాంతంలో ఇద్దరు చనిపోయారు. అలాంటివి జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటు న్నారు? - **గూడెపు నాగరాజు, రాంరెడ్డి, కూకట్‌పల్లి**

□ **ఎండీ:** ద్విచక్ర వాహనదారులు కొంచెం సందు ఉంటే వెళుతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే అన్నీ బ్యారికేడ్ల వల్ల అనే దాంట్లో వాస్తవం లేదు. మరిన్ని నివారణ చర్యలు తీసుకుంటాం.

● **ప్రశ్న:** మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్ల మధ్య బస్సులు నడు పుతారా?

– రాజశేఖర్, లోతుకుంట

□ **ఎండీ:** భరత్‌నగర్, మలక్‌పేట తదితర ఆరు ఎంఎంటీఎస్ స్టేషన్ల నుంచి మెట్రో స్టేషన్ల మధ్య బస్సులు నడుపుతాం. స్టేషన్ల నుంచి కాలనీలకు వెళ్లేందుకు మెట్రో గో రౌండ్ అనే బస్సులను నడుపుతాం. ఒక్కో స్టేషన్‌కు కుడి, ఎడమ వైపు ఏవి కాలనీలు ఉన్నాయో ఇప్పటికే గుర్తించాం. వాటిని వెబ్ సైట్‌లో చూడొచ్చు. అలాగే నగరంలో 100 స్కై వాక్‌లు ఏర్పాటు చేస్తాం. అంతేకాకుండా ఆర కిలోమీటరు పొడవునా పలు చోట్ల వాకింగ్ ట్రాక్‌లు రూపొందిస్తాం.

● **ప్రశ్న:** శ్రీకృష్ణానగర్ మార్గంలో నష్టపోతున్న భవన యజ మానులకు ఎలెక్కువ పరిహారం ఇస్తారు?

– రాజశేఖర్, ఎ.రామలింగం, సుశీధర్, శ్రీకృష్ణానగర్

□ **ఎండీ:** హైకోర్టు స్టే కారణంగా ఇప్పటివరకు అక్కడ పనులు మొదలుపెట్టలేదు. మేం కోర్టుకు నివేదిక సమర్పించిన తర్వాత సర్వే, భూసార పరీక్షలకు అనుమతినిచ్చింది. సోమవారం నుంచి సర్వే మొదలుకానుంది. యూఎల్‌సీ, ప్రభుత్వ భూముల్లో నివాసమున్న వారికి సైతం పరిహారం ఇవ్వనున్నాం. గజానికి రూ.45వేలతో పాటు నిర్మాణాలకు కూడా ప్రత్యేకంగా పరిహారాన్ని ఇస్తాం.

● **ప్రశ్న:** ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో రోప్ వేలు నిర్మించవచ్చు కదా?

–శివప్రసాద్ శర్మ, మీర్‌పేట

□ **ఎండీ:** రద్దీ ప్రాంతంలో, అదీ నగరంలో రోప్ వే(తీగ మార్గం) ఏర్పాటు వేయలేం. ఎందుకంటే ఇక్కడ గంటకు 30 వేల నుంచి 50 వేల వరకు ప్రయాణికులు రాకపోకలు సాగించాలి. అవి కేవలం పర్యాటకప్రాంతాలకే బాగుంటాయి.

● **ప్రశ్న:** మెట్రో నేపథ్యంలో తార్నాక-సీతాఫల్‌మండి రోడ్డును ఎప్పుడు పూర్తి చేస్తారు?

– శ్యాంసుందర్, సీతాఫల్‌మండి, ప్రైవేటు ఉద్యోగి

□ **ఎండీ:** రోడ్డును జీహెచ్ఎంసీ చేపట్టింది. రామాంతాపూర్ రోడ్డు పూర్తయ్యింది. 15 రోజుల్లో ప్రారంభిస్తారు. అలా తార్నాక-సీతాఫల్‌మండి-చిలకలగూడ రోడ్డు కూడా కొంత పూర్తయ్యింది. అది కూడా త్వరలో పూర్తయ్యేలా చూస్తాం.

● **ప్రశ్న:** అసలు మెట్రో పనులు ప్రారంభమయ్యాయా? ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుంది?

– భవాని ప్రసాద్, సికింద్రాబాద్

□ **ఎండీ:** ఈనెల 26న కంపెనీవారు పనులు ప్రారంభించారు. ఇది అధికారిక ప్రారంభోత్సవం కాదు. ఆ కార్యక్రమానికి మేం ప్రభుత్వం తరఫున హాజరయ్యాం. డిసెంబరు, 2012 వరకు మొదటి దశ పూర్తి చేస్తాం. అనంతరం ఒకటే, రెండు మాసాలకు ఒకో దశ చొప్పున... 2016 వరకు మొదటి దశ 71.16 కిలోమీటర్ల ప్రాజెక్టును పూర్తి చేస్తాం.

● **ప్రశ్న:** నిజాంపేట నుంచి జేఎన్‌టీయూ చౌరస్తా వరకు విపరీతమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– విద్యాసాగర్, నిజాంపేట

□ **ఎండీ:** మియాపూర్ నుంచి ఎస్ఆర్‌నగర్ వరకు ఐదు కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నాం. నిజాంపేట నుంచి ఎల్లమ్మబండ వరకు ప్రత్యామ్నాయ రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఒకట్రెండు నెలల్లో అవి అందుబాటులోకి వస్తాయి. ఇంకా గుర్తించిన ప్రత్యామ్నాయ మార్గాలను కూడా దశలవారీగా అందుబాటులోకి తెస్తాం. ఐదేళ్ల ప్రాజెక్టు అయినందున ఏడాదిలోపు అన్ని ప్రత్యా మ్నాయ రహదారులను అభివృద్ధి చేస్తాం.

● **ప్రశ్న:** జేఎన్‌టీయూ చౌరస్తా వద్ద విపరీతమైన ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. హైటెన్షన్ విద్యుత్తులైనును అనుసరించి ప్రత్యామ్నాయ రోడ్డును అభివృద్ధి చేయవచ్చు కదా...

– టి.వెంకటేశ్వర్‌రావు, వివేకానందనగర్ కాలనీ

□ **ఎండీ:** మంచి సూచన. ఈ పనులను ఇప్పటికే చేపట్టాం.

● **ప్రశ్న:** మెట్రోను బీహెచ్ఈఎల్ వరకు విస్తరించవచ్చు కదా. కూకట్‌పల్లి ప్రాంతంలో రోడ్డు సరిగా లేకపోవడంతో వాహనాలు కేవలం మొదటి గేరులో నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుంది. అలాగే రెండో దశ ఎప్పుడు చేపడతారు?

– రాజేందర్ సింగ్, చందానగర్, శ్రీనివాస్-ఘట్‌కేసర్, జగదీశ్వరరావు– బేగంపేట.

□ **ఎండీ:** మొదటి దశ పూర్తి చేసి, మంచి ఫలితాలను చూపితే రెండో దశకు పచ్చజెండా ఊపేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. ఇక... రోడ్లుసరిగా లేకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు పెరుగుతుండటం వాస్తవమే. చిన్నపాటి వర్షానికి రోడ్లు గుంతలు పడుతున్నాయి. ఈ ప్రాంతాలను గుర్తించి మరమ్మతు చర్యలు చేపడుతున్నాం.

● **ప్రశ్న:** మెట్రో రైలులో ఉగ్రవాద కార్యకలాపాల నివారణకు ఎటువంటిచర్యలు తీసుకుంటున్నారు?

– సంపత్, మూసాపేట, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు

□ **ఎండీ:** రక్షణపరంగా అన్ని కోణాల్లో జాగ్రత్తలు తీసు కుంటున్నాం. కేంద్ర హోంశాఖ, రాష్ట్ర పోలీసు శాఖతో కూడా చర్చించాం. ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి ఉగ్రవాద కార్యకలాపాలు జరుగుతున్నాయో కూడా పరిశీలన జరిపాం. అలాంటి కార్యకలాపాలు జరగకుండా, ముందుగానే పసిగట్టే వ్యవస్థ ఉంటుంది. సీఐఎస్ఎఫ్ పోలీసులు కూడా ఉంటారు

● **ప్రశ్న:** మెట్రో పనుల దరిమిలా ట్రాఫిక్ కష్టాలు ఎక్కు వవుతున్నాయి. ఇందుకు పరిష్కారంగా నగరంలోని జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్తు ఇలా అన్ని శాఖలు ఒకే వేదికపై వచ్చి సమన్వయంతో పని చేయాల్సి ఉంది. ఈ మేరకు ఓ కమిటీ కూడా వేస్తే బాగుంటుంది.

- రాము దేవపాటి, ఐయాం వాట్ ఐడియట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

□ **ఎండీ:** ఇది మంచి సూచన. ఇప్పటికే అన్ని శాఖలను సమ న్వయపరిచి.. ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేశాం. దీనికి చీఫ్ సెక్రటరీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అన్ని శాఖలతో కలిసి రోడ్డు విస్తరణ పనులతో పాటు వర్షాలు వచ్చినప్పుడు వరద నీరు సాఫీగా వెళ్లేందుకు వరద నీటి కాల్వల ఆధునికీకరణ పనులు కూడా చేపట్టనున్నాం.

● **ప్రశ్న:** మెట్రో పనులు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు పరిష్కారమయ్యేందుకు మా వద్ద ఒక అధ్యయన నివేదిక ఉంది. దీనిని వినియోగించుకునే అవకాశముందా?

– జీవీ రెడ్డి, కూకట్‌పల్లి

□ **ఎండీ:** ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు స్వీక రించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మా కార్యాలయానికి సా.5-రా.8గంటల వరకు ఎవరైనా వచ్చి నేరుగా కలవచ్చు. అంతకుముందు 040-23388580, 81 నెంబర్లకు ఫోన్ చేసి సమయం తీసుకుంటే సరిపోతుంది. సలహాలుంటే 040-23388582 నెంబరుకు ఫ్యాక్స్ కూడా చేయొచ్చు.

● **ప్రశ్న:** మియాపూర్ నుంచి పనులు ఎప్పుడు మొదలు?

– లక్ష్మి, బీహెచ్ఈఎల్

□ **ఎండీ:** ఇప్పటికే ఎన్‌హెచ్ విస్తరణ పనులు జరుగుతు న్నాయి. భూ సాంద్రత పరీక్షలు చేపడుతున్నాం. మరో నెల రోజుల్లో పూర్తిస్థాయిలో పనులు ప్రారంభిస్తాం.

● **ప్రశ్న:** మెట్రో పనుల్లో వలంటీర్లుగా సాయం చేసేందుకు చాలామంది విద్యార్థులం సిద్ధంగా ఉన్నాం!

– సాయికిరణ్, విద్యార్థి, లాలాపేట

□ **ఎండీ:** అవసరమైతే వాడుకుంటాం.

● **ప్రశ్న:** టిక్కెట్ ధరలు అందుబాటులో ఉంటాయా?

-పి.మాణిక్య ప్రభు, జనరల్ బజార్, కొత్తపల్లి రాముగౌడ్, మూసాపేట

□ **ఎండీ:** 2014 నాటికి కనిష్ఠ చార్జీ రూ.8, గరిష్ఠంగా రూ.19 ఉంటుంది. అప్పటితో ధరలతో పోల్చితే అన్నిటి కంటే మెట్రో రైలు టిక్కెట్ ధరే తక్కువగా ఉంటుంది.

● **ప్రశ్న:** మూసాపేట నుంచి కేపీహెచ్‌పీ ప్రత్యామ్నాయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ట్రాఫిక్ జాంలు అవుతున్నాయి.

– మూర్తి, కేపీహెచ్‌పీ

□ **ఎండీ:** జీహెచ్ఎంసీతో కలిసి ఈ రహదారి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అంతేకాక ట్రాఫిక్ సమస్య లేకుండా ఈ ప్రాంతంలో జంక్షన్ అభివృద్ధి చేస్తున్నాం. ఎన్‌హెచ్ విస్తరణ పనులూ వేగంగా జరుగుతున్నాయి.

● **ప్రశ్న:** భరత్‌నగర్ కూరగాయల మార్కెట్‌పై నుంచి మెట్రో వెళితే అక్కడ బతికే వందలాది కుటుంబాల పరిస్థితి ఏమిటి?

– కృష్ణారెడ్డి, కూకట్‌పల్లి

□ **ఎండీ:** ఎవరికి ఎలాంటి ఆటంకం ఉండదు.

● **ప్రశ్న:** నారాయణగూడ ప్రాంతంలో విస్తరణ పనులు ఎప్పుడు ఉంటాయి? ఆస్తి కోల్పోయిన వారికి ఎలా ఆదుకుంటారు?

–రజిత, వ్యాపారి, నారాయణగూడ

□ **ఎండీ:** ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. వ్యాపారు లకు ఎలాంటి నష్టం లేకుండా పరిహారం కింద మంచి ప్యాకేజీని అందిస్తున్నాం. స్థలంతోపాటు నిర్మాణాలకు కూడా పరిహారం లెక్కగట్టి ఇవ్వనున్నాం.

● **ప్రశ్న:** ఉప్పల్‌లో గడ్డిభూములు కోల్పోయిన వారికి ఉద్యో గాలు ఇచ్చే అవకాశం ఉందా?

– భాస్కర్‌గౌడ్, ఉప్పల్

□ **ఎండీ:** వృత్తి నైపుణ్యం ఉంటే తప్పక పరిశీలిస్తాం. లేని వారికి ఎల్అండ్‌టీ కంపెనీయే మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి పను ల్లోకి తీసుకుంటుంది. శిక్షణ సమయంలో స్టైఫండ్ కూడా ఇస్తారు. మెట్రో ద్వారా కొత్తగా 50 వేల మందికి ఉపాధి అవ కాశాలు దొరుకుతున్నాయి.